

ఓపీలను పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ సిరి

జిజిహెచ్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- సూపర్ స్పెషాలిటీ విభాగం పనులు డిసెంబర్ చివరికి పూర్తి కావాలి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా అని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులను ఆరా తీశారు. గురువారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని క్యాజువాలిటీ ఎమర్జెన్సీ వార్డు, మేల్ ఓపీ, క్రిటికల్ ఎమర్జెన్సీ వార్డు, సూపర్ స్పెషాలిటీ బ్లాక్, న్యూ డయాగ్నొస్టిక్ బ్లాక్‌లను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ముందుగా క్యాజువాల్టీ ఎమర్జెన్సీ వార్డులో ట్రీట్‌మెంట్ తీసుకుంటున్న చిన్న కేశవ, కొండయ్య, షేక్ ఫాతిమా, రామచంద్రుడుల బంధువులతో మాట్లాడుతూ వైద్యులు ట్రీట్‌మెంట్ ఏ విధంగా ఇస్తున్నారని వివరంగా మాట్లాడారు. ధైర్యంగా ఉండాలని, వైద్యులు బాగా ట్రీట్‌మెంట్ చేస్తారని, త్వరగా కోలుకుంటారని కలెక్టర్ పేషెంట్ బంధువులకు ధైర్యం చెప్పారు. జనరల్ మెడిసిన్ ఓపీ విభాగాన్ని పరిశీలిస్తూ శీతాకాలం కదా సీజనల్ రోగాలతో ఎవరైనా అడ్మిట్ అవుతున్నారా? ఎక్కువగా ఎలాంటి రోగాలతో అడ్మిట్ అవుతున్నారని తెలుసుకున్నారు. మేల్ ఓపీలో అడ్మిట్ అయిన పేషెంట్ కేస్ షీట్ వివరాలు చూసి సరిగా రాయాలన్నారు. పేషెంట్లకు సంబంధించిన రిజిస్టర్, రోగ నిర్ధారణ (డయాగ్నోసిస్) ఐపి నెంబర్లు ఎంట్రీలు సరిగా చేయడం లేదని, ఎంట్రీలు సక్రమంగా చేయాలని కలెక్టర్ సంబంధించిన ఆర్థో విభాగపు వైద్యులను ఆదేశించారు. వైద్యులు ఓపి రిజిస్టర్లను ప్రత్యేకంగా పెట్టుకొని పేషెంట్ల వివరాలతో పాటు రోగనిర్ధారణ వివరాలు కూడా రాయాలని, తద్వారా ఏ కేసులు ఎక్కువగా వస్తున్నాయనే వివరాలు తెలుస్తాయన్నారు. టాయిలెట్లు మరమ్మతులు చేయించేందుకు ఎస్టిమేట్ సిద్ధం చేసి ఫైల్ పంపించాలని కలెక్టర్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. సూపర్ స్పెషాలిటీ విభాగంలోని న్యూరాలజీ, యూరాలజీ ఓటి థియేటర్స్ పనులు డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలన్నారు. స్క్రాప్ ద్వారా ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశం ఉంటుందని, స్క్రాప్ మొత్తం నెల లోపు తీసేసి శుభ్రంగా పెట్టాలని కలెక్టర్ వైద్యాధికారులను ఆదేశించారు. వైద్యులు సమయపాలన, ఎఫ్ఆర్ఎస్‌కు సంబంధించిన వివరాలు గురించి, న్యూ డయాగ్నొస్టిక్ బ్లాక్‌లోని క్రిటికల్ కేర్‌బ్లాక్ పనుల గురించి కలెక్టర్ సంబంధిత అధికారులతో ఆరా తీశారు. అనంతరం కెఎంసిలో విద్యార్థినుల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. వారితో ప్రత్యేకంగా మాట్లాడి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ బాయ్, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రమణ్యం, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల ప్రోత్సాహకం కింద రూ 9.72 లక్షలు

కర్నూలు కలెక్టరేట్ : జిల్లాలో పరిశ్రమల ప్రోత్సాహం కింద మూడు క్లెయిమ్‌లకు సంబంధించిన రూ9.72 లక్షలను విడుదల చేస్తూ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి నిర్ణయం తీసుకున్నారు. గురువారం కలెక్టరేట్లో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఎక్ఫర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా వచ్చిన దరఖాస్తులకు గడువు లోపు అనుమతులను మంజూరు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద లబ్ధిదారులకు త్వరితగతిన రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎల్‌డిఎంను ఆదేశించారు. పిఎంఇజిపి కింద కూడా ఎక్కువ మందికి లబ్ధి కలిగేలా దరఖాస్తులను బ్యాంకులకు పంపించి రుణాలు మంజూరు చేయించాలన్నారు. జిల్లాలో పారిశ్రామిక ప్రగతి గురించి ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఎపిఐఐసి జోనల్ మేనేజర్‌ను ఆదేశించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జిఎం అశోక్ కుమార్, పరిశ్రమల శాఖ డిడి జవహర్‌బాబు, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ, నాబార్డ్ డిడిఎం సుబ్బారెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇఇ కిషోర్ కుమార్ రెడ్డి, ఎల్‌డిఎం రామచంద్రారావు, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి, డిపిఒ భాస్కర్ ,జెడి అగ్రికల్చర్ వరలక్ష్మి , ఎడి హార్టికల్చర్ రాజా కృష్ణారెడ్డి, ఎస్సీ ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజామహేంద్రనాథ్, ఐలా చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పార్కింగ్ నిబంధనలు బేఖాతరు

• పార్కింగ్ లేకుండా హాస్పిటల్స్, కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలు • రోడ్డుపైన నిలిపేస్తున్న వాహనాదారులు
• నిబంధనలు పట్టించుకోని అధికారులు • పార్కింగ్ స్థలాలను ఇతర వాటికి వినియోగం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో వాణిజ్య సముదాయాలు, షాపింగ్‌మాల్స్, హాస్పిటల్స్ వేగంగా విస్తరిస్తున్నాయి. గాయత్రి ఎస్టేట్, ఎన్ఆర్‌పేట, కొత్తబస్టాండ్, బుధవారపేట, అబ్దుల్లాఖాన్ ఎస్టేట్, చెక్‌పోస్టు ప్రాంతాలలో రోజు రోజుకు హాస్పిటల్స్, కమర్షియల్ కాంప్లెక్సులు పెరిగిపోతున్నాయి. నగరంలో నిత్యం వందలాది మంది వచ్చి పోయే హాస్పిటల్స్, షాపింగ్‌మాల్స్, వాణిజ్య సముదాయాల యజమానులకు లాభార్జనేతప్ప భవన, పార్కింగ్ నిబంధనలను ఏమాత్రం పట్టించుకోకపోడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. పార్కింగ్‌కు స్థలం ఉండాలన్న నిబంధనలను యాజమాన్యాలు పట్టుంచుకోవడం లేదు. వీటిని తనిఖీ చేసి భవన నిర్మాణానికి అనుమతులు యిచ్చే నగర కార్పొరేషన్ అధికారులు మామ్ముళ్ల మత్తులో చూసీ చూడనట్లు వదిలేసారన్న ఆరోపణలు వున్నాయి.



పార్కింగ్ లేని అఫెక్స్ హాస్పిటల్

పార్కింగ్ నిబంధనలేం చెబుతున్నాయి..!

భవన నిర్మాణ సమయంలోనే ప్రత్యేకంగా పార్కింగ్ ఏర్పాటు చేయాలి. రెండు 3.6 మీటర్ల వెడల్పు ర్యాంపులు లేదా ఒక 5.4 మీటర్ల ర్యాంపు ఉండాలి. భవనం ఎత్తుబట్టి కనీస రోడ్ వెడల్పు, సెట్ బ్యాక్ ఏరియా (భవనం చుట్టూ ఖాళీ స్థలం), 18 మీటర్ల ఎత్తు వరకు కనీసం 4 నుంచి 6 మీటర్లు, ఉండాలి. 30 మీటర్లకు పైగా ఎత్తు ఉంటే కనీసం 9 మీటర్ల వరకు సైడ్ స్పేస్ అవసరం.

ఆస్పత్రులకు ప్రత్యేక నిబంధనలు..

హాస్పిటల్స్‌కు సెట్ బాక్స్ ఏరియా భవనం చుట్టూ ఖాళీ స్థలం 4 మీటర్ల నుంచి 12 మీటర్లు వరకు, అంబులెన్స్/ఫైర్ వెహికల్ వెళ్లేందుకు మినిమం ఏడు మీటర్ల సెట్ బ్యాక్ తప్పనిసరి ఉండాలి. 30 మీటర్ల కంటే ఎత్తైన భవనం, హాస్పిటల్స్‌కు ప్రత్యేక ఫైర్ సేఫ్టీ నిబంధనలు ఉంటాయి.పార్కింగ్ సంబంధించి ప్రతి 100 చదరపు మీటర్ల ఫ్లోర్ ఏరియాకు కనీసం ఒక కార్ పార్కింగ్ స్థలం అవసరం. బేస్‌మెంట్ లేదా స్టిల్ట్ పార్కింగ్ తప్పనిసరి. వాణిజ్య భవనాల్లో అదనంగా 10 నుంచి 20 గెస్ట్ పార్కింగ్ ఉండాలి. గాయత్రి ఎస్టేట్‌లోని హాస్పిటల్స్, క్లినిక్స్, డయాగ్నోస్టిక్ సెంటర్స్ వందలాది వాహనాలు వచ్చి వెళ్తున్న వాటికి కనీసం పార్కింగ్ లేకపోవడం, కార్లు, బైక్ లను రోడ్డు పైనే నిలిపేస్తున్నారు. దానితో అనేక సార్లు ట్రాఫిక్ జామ్స్ అవుతున్నాయి. కొత్తగా నిర్మిస్తున్న భవనాలు కూడా ఏమాత్రం నిబంధనలు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ఉదాహరణకు ప్రస్తుతం 4 అంతస్తులలో వున్న వాసవి అపెక్స్ హాస్పిటల్ ఎలాంటి పార్కింగ్ లేదు. దానితో ఆ హాస్పిటల్స్‌కు వచ్చిపోయే పేషెంట్స్ సహాయకులు, బంధువులు కార్లను, బైక్‌లను రోడ్డుపైనే పార్కింగ్ చేసి వెళ్తుండంతో అనేకసార్లు ట్రాఫిక్ జామ్ అవుతున్నాయి. ఆ దారిలో ఇతర హాస్పిటల్స్ వెళ్లే అంబులెన్స్‌లలో దారి లేక ఇబ్బంది పడే పరిస్థితి. అదే వాసవి అపెక్స్ హాస్పిటల్ దానికి దగ్గరలో కొత్తగా ఐదంతస్తులతో కొత్త హాస్పిటల్‌ను నిర్మిస్తుంది. పార్కింగ్ నిబంధనలు ఉల్లంఘించి హాస్పిటల్ ను నిర్మిస్తున్నారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో, ఎదురుగా, కనీసం పార్కింగ్ స్థలం వదలకుండానే నిర్మిస్తున్నారు. దానితో యదా మాములుగానే వాహనాలను బయటే నిలిపి ఉంచాల్సిన పరిస్థితులు వున్నాయి. వాటికి నగర కార్పొరేషన్ అధికారులు పార్కింగ్ లేకుండానే ఎలా అనుమతులు యిచ్చారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కొన్ని హాస్పిటల్స్ పార్కింగ్ ఏర్పాటు చేసినా ఆ స్థలాన్ని పార్కింగ్ కోసం కాకుండా ఇతరవాటికి వినియోగిస్తున్నారు. దాని తోటి ఆ హాస్పిటల్స్‌లోని వాహనాలన్నీ రోడ్డుపైనే అడ్డదిడ్డంగా నిలిపేస్తున్నారు. గాయత్రి ఎస్టేట్‌లోని ఆకాష్ హాస్పటల్‌కు పార్కింగ్ స్థలం వుంది. దానికి తాళం వేసి పార్కింగ్ స్థలంలో అకౌంట్ సెక్షన్స్ నిర్వహిస్తున్నారు. దీంతో కార్లు, బైక్స్ బయటే నిలుపుతున్నారు. అర్కాహాస్పిటల్ పార్కింగ్ వున్నా రద్దీకి తగ్గ లేకపోవడం వున్న స్థలంలో ఉన్న ఆఫీస్‌కు ఉపయోగిస్తుండటంతో ఆ హాస్పిటల్స్ వచ్చే కార్లను రోడ్డు పైనే పార్క్ చేస్తున్నారు. మరికొన్ని హాస్పిటల్స్ పార్కింగ్ స్థలాన్ని ఇతర వాటికీ వినియోగిస్తున్నారన్న ఆరోపణలు వున్నాయి. మంజీరా, సహస్ర, అంకిత, విశ్వభారతి, బస్టాండ్ ఏరియా, ఎన్ఆర్‌పేట, బుధవార పేటలోని అనేక హాస్పిటల్స్ ఏమాత్రం పార్కింగ్ స్థలాలు లేక వాహనాలను బయటే నిలిపేస్తున్నారు.

కమర్షియల్ కాంప్లెక్స్‌లోను అంతే...

అబ్దుల్లా ఖాన్ఎస్టేట్, పెద్దపార్క్ వద్ద వుండే షాపింగ్ కాంప్లెక్స్ కందుకూరి షాపింగ్ మాల్, సౌత్ ఇండియా షాపింగ్‌మాల్, జీవి మాల్ వంటి బట్టల షాపులు, మరికొన్ని గోల్డ్ షాపులు పార్కింగ్ లేకుండానే లేదా పార్కింగ్ వున్న రద్దీకి తగ్గట్లు నిబంధనలు పాటించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. వీటిపై ఇప్పటికైనా నగరపాలక అధికారులు దృష్టి సారించి చర్యలు చేపట్టాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

రోడ్లపైనే వాహనాలను పార్కు చేస్తున్నారు

- సి.శేషాద్రి, కర్నూలు



గాయత్రి ఎస్టేట్‌లో అనేక హాస్పిటల్స్, క్లినిక్స్, డయాగ్నోస్టిక్స్ సెంటర్స్ ఉన్నాయి. వాటికోసం వచ్చే వారు బైకులను, కార్లను రోడ్లపైనే పార్క్ చేస్తున్నారు. దీంతో అనేకసార్లు ట్రాఫిక్‌జామ్ అయ్యివాహనదారులు అంబులెన్స్ ఇబ్బంది పడుతున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించాలి.

చర్యలు తీసుకోవాలి

- ఎస్.అబ్దుల్లా, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి



కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్, హాస్పిటల్స్ యజమానులు పార్కింగు నిబంధనలు పాటించడం లేదు. చాలా వాటికీ పార్కింగ్ సౌకర్యమే లేదు. వున్న కొన్ని వాటిని హాస్పిటల్స్ పార్కింగ్ ప్లేస్‌లను కూడా కమర్షియల్‌గా ఉపయోగించుకుంటున్న నగర కార్పొరేషన్ అధికారులు మామూళ్లకు పాల్పడి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. దీంతో వాహనాలను రోడ్డుపైన పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వీటిపై తక్షణమే నిబంధనలు పాటించని వాటిపై చర్యలు చేపట్టాలి.

చర్యలు తీసుకుంటున్నాం

- కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్



పార్కింగ్ ప్రదేశాలను ఇతర విషయాలకు వాడుకుంటూ ఉన్నవారికి, పార్కింగ్ స్థలాలు లేని వారికి నోటీసులు ఇచ్చాం. గుత్తి పెట్రోల్ బంకు వద్ద ముందుగా ప్రారంభించాం. తర్వాతమిగతా ప్రాంతాల్లో కూడా చర్యలు తీసుకోవడం మొదలు పెడతాం.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి


- కలెక్టరేట్ ఎదుట భవన నిర్మాణ కార్మిక సంఘం ధర్నా

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు డిమాండ్ చేశారు.పెండింగులో ఉన్న క్లెయిమ్‌లకు నిధులను వెంటనే విడుదల చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. గురువారం కలెక్టరేట్ ఎదుట ఎపి భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. జిల్లా నాయకులు కె.సుధాకరప్ప అధ్యక్షతన జరిగిన ధర్నానుద్దేశించి అంజిబాబు, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.నరసింహులు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఖాజా బాషా, జిల్లా నాయకులు టి.రాముడు మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు నిలిచిపోవడం వల్ల సంక్షేమ పథకాలు అమలు కావడం లేదన్నారు. సంక్షేమ బోర్డు ఉన్నప్పుడు భవన నిర్మాణ కార్మికులకు ప్రమాదం జరిగితే బీమా రూ.5 లక్షలు వచ్చేదని, సాధారణ మరణానికి రూ.రెండు లక్షలు, కార్మికుడు ఇంట్లో పెళ్లి జరిగినా, కాన్పు అయినా రూ.20వేలు ఆర్థిక సాయం అందజేసే వారన్నారు. గత ప్రభుత్వం 12,14 మెమోను తీసుకువచ్చి నిలుపుదల చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా అధికారం లేకి వస్తే భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునర్ ప్రారంభిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఇంతవరకు హామీని నిలబెట్టుకోలేదని పేర్కొన్నారు. భవననిర్మాణ కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నగర అధ్యక్షులు మాబాష, నాగరాజు, సిఐటియు నగర అధ్యక్షులు అబ్దుల్ దేశాయ్, పెయింటర్స్ యూనియన్ నగర సెక్రటరీ నరేంద్ర, పెయింటర్స్ యూనియన్ నాయకులు జాఫర్‌హుస్సేన్, సెంట్రింగ్ యూనియన్ నాయకులు దస్తగిరి, రఫీ, జైపాల్ భవన నిర్మాణ కార్మిక సంఘం నగర నాయకులు ప్రభాకర్, మద్దిలేటి, ఏసు, మూసా ఖాన్, జలాలుద్దీన్, లక్ష్మన్న, ఎం.గోపాల్, విజయుడు, రాజు, శ్రీనివాసులు, ఓబులేసు పాల్గొన్నారు.



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న నాయకులు



పోస్టర్‌ను విడుదల చేస్తున్న జి.పుల్లయ్య , శ్రీహర్ష, మన్సూర్ రహ్మాన్ , తదితరులు

గుండ్రేవుల సాధనకు జల సమర దీక్ష

కెపిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీహర్ష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లాలో సాగు, తాగునీటి సమస్య పరిష్కారానికి గుండ్రేవుల ప్రాజెక్టు సాధన కోసం ఈనెల 24, 25 తేదీల్లో జల సమర దీక్ష నిర్వహిస్తున్నట్లు కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.శ్రీహర్ష పేర్కొన్నారు. జల సమర దీక్షకు పెద్ద ఎత్తున రైతులు, ప్రజలు పాల్గొని మద్దతు తెలపాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం జల సమర దీక్షకు సంబంధించిన గోడపత్రికలను రవీంద్రవిద్యా సంస్థల అధినేత జి పుల్లయ్య, కర్నూలు జిల్లా మేధావుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు మన్సూర్ రెహ్మాన్‌లతో కలిసి శ్రీహర్ష ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2 లక్షల ఎకరాలకు సాగునీరు, కర్నూలు నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లో 10 లక్షల మందికి తాగునీరు అందించే గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మించాలని డిమాండ్ చేశారు. కరువు నివారణకు, యువతకు ఉపాధి అవకాశాలు లభించేందుకు ఈ ప్రాజెక్టును నాంది పలుకుతుందన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు జిల్లాలో అవసరమైన భూమి ఉందన్నారు. దాంతోపాటు నీళ్లు కూడా ఎంతో అవసరం అన్నారు. నీళ్లు పుష్కలంగా లభించాలంటే గుండ్రేవుల ప్రాజెక్టు చేపట్టాలన్నారు. ఈనెల 24న కర్నూలు నగరంలోని శ్రీకృష్ణదేవరాయ సర్కిల్ ధర్నా చౌక్ సమీపంలో నిర్వహించే రెండు రోజులపాటు దీక్షకు తరలిరావాలని కోరారు. పిడియస్‌యు నాయకులు భాస్కర్, రమణ, కెపిఎస్ సభ్యులు రామాంజనేయులు, వెంకీ, చిన్న, ధర్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఎపిసిగా లోకరాజు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్: సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ గా లోకరాజును నియమిస్తూ రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ గురువారం ఉత్తర్వులను జారీ చేశారు..ప్రస్తుతం ఇన్చార్జి ఎబిసిగా జిల్లా విద్యాశాఖ అధికారి కొనసాగుతున్నారు.ప్రస్తుతం ఆయన నంద్యాల జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లెక్చరర్ పనిచేస్తూ ఇక్కడికి డిప్యూటేషన్ మీద నియమితులయ్యారు.

నేటి నుంచి ఆర్‌పిల నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : సమస్యల పరిష్కారం కోసం ఈనెల 21 నుండి 29 వరకు నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు ఆర్‌పిల సంఘం జిల్లా కమిటీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. మెప్మా ఆర్‌పిలు మనో వేదన, మానసిక వత్తిడి, శ్రమకు తగ్గ ఫలితం లేక కుటుంబ సభ్యులు మెప్మా సిబ్బంది మధ్య ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రజ్ఞ యాప్ టార్గెట్ అంటూ ప్రాణం తీస్తున్నారు. పై సమస్యల పరిష్కారానికి నవంబర్ 21 నుండి 29 వరకు కలెక్టరేట్ గాంధీ విగ్రహం ముందు నిరసనకార్యక్రమం నిర్వహించ బోతోంది ఏపీ మెప్మా అర్పి ఉద్యోగుల సంఘము తెలియజేసింది.

సాగు,తాగునీరు ఇవ్వకుంటే మహా ఉద్యమం

-సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్

- పత్తికొండ ప్రదర్శన, ధర్నా డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మి కు వినతి

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ నియోజకవర్గంలోని చెరువులకు నీళ్లనింపి పంట కాలువల ద్వారా సాగు, తాగునీరు అందించకపోతే మరో మహాఉద్యమాన్ని చేపడతామని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం పత్తికొండ పట్టణంలో తేరుబజార్ నుండి పత్తికొండ, తుగ్గలి, మద్దికేర, దేవనకొండ సిపిఎంనాయకులు ఆర్‌డిఒ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి చక్రాలవెంకటేశ్వర్ రెడ్డి అధ్యక్షన నిర్వహించిన ధర్నానుద్దేశించి గౌస్‌దేశాయ్ మాట్లాడారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా పత్తికొండ ప్రజల జీవితాలు మారడం లేదన్నారు. పత్తికొండ నియోజకవర్గం నుండి గెలుపొందిన ప్రజాప్రతినితులు మంత్రులు, ఉపముఖ్యమంత్రులు అయినప్పటికీ ఈ ప్రాంతం ఏమాత్రం అభివృద్ధికి నోచుకోకపోవడం బాధాకరమైన అంశం అన్నారు. చేతగాని ప్రజా ప్రతినిధులు గెలవడం ఈ ప్రాంత ప్రజలు చేసుకున్న దౌర్భాగ్యమని ఘాటుగా విమర్శించారు. చంద్రబాబునాయుడు పత్తికొండ నియోజక వర్గానికి వచ్చినప్పుడు చెరువులు నింపుతామని, టమోటజ్యూస్ ప్యాక్టరీ నిర్మిస్తామని ఏ ఒక్క సమస్య హామీ అమలు చేయలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఏం చేస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని నిలదీశారు. కర్నూలు జిల్లాలో వేదవతి, గుండ్రేవుల, ఆర్‌డిఎస్ కుడి కాలువ నిర్మాణం చేపట్టడం ద్వారా శాశ్వత కరువు నివారణ చేపట్టవచ్చని అన్నారు. ముఖ్యమంత్రి గోదావరి–బానకచర్ల ప్రాజెక్టు తీసుకుని వస్తానడం ప్రజల్ని మోసం చేయడం తప్ప మరొకటి కాదన్నారు. రూ.పదివేల కోట్లు ఖర్చు పెడితే కర్నూలు జిల్లా సాగునీటి ప్రాజెక్టు పూర్తయ్యే అవకాశమున్నప్పటికీ దాని గురించి ఏ మాత్రం ఆలోచించకుండా రూ.85 వేలకోట్లు ఖర్చుపెట్టి బనకచర్ల ప్రాజెక్టు తెస్తానన్నడం సరైంది కాదన్నారు. అధిక వర్షాల వల్ల పత్తి, ఉల్లి, టమోటా,వేరుశనగ పంటలు దెబ్బతిన్నాయని అన్నారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సాగునీటి వనరులు రైతాంగానికి అందించకపోతే రాబోయే కాలంలో మహాఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎండి ఆనంద్ బాబు మాట్లాడుతూ ఈ ప్రాంతం నుండి ప్రజలు ఉపాధి లేక వేలాదిమంది వలసలు వెళుతున్నా కళ్ళులేని గుడ్డివాడి లాగా ప్రభుత్వం వ్యవహరిస్తుంది తప్ప వలసలు నివారణ కోసం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పత్తికొండ మండల నాయకులు రంగారెడ్డి, దస్తగిరి, గోపాలు, రవిచంద్ర, తుగ్గలి మండల నాయకులు శ్రీరాములు, కొండారెడ్డి, భాస్కర్ రెడ్డి, దేవనకొండ సూరి, బజారి, మద్దికేర నాయకులు రాముడు, ప్రజానాట్యమండలి నాయకులు పెద్ద కాశన్న, రమేష్, గ్రామాల నాయకులు, రైతు సంఘం నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



పత్తికొండలో ప్రదర్శనుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్

కల్వర్టు శిథిలం - మధ్యలో రంధ్రం- ఆదమరిస్తే అంతే...

ప్రజాశక్తి-సి బెళగల్ : తిమ్మందొడ్డి, చింతమాను పల్లి మధ్య గ్రావెల్ రోడ్డులో కల్వర్టు శిథిలం అయ్యింది. ఆ కల్వర్టు నిర్మించి పది సంవత్సరాలు కాకముందే కూలడానికి సిద్ధంగా ఉండడటంతో అక్కడే మధ్యలో రంధ్రం ఏర్పడినందున వాహనదారులు భయం భయం గా దాటి వెళ్తున్నారు. తిమ్మందొడ్డి పునరావాస గ్రామంగా 20011 ఏర్పడింది.. ఆ గ్రామానికి సి బెళగల్ నుండి వెళ్లాలన్నా రావాలన్నా ఇదే రోడ్డు గతి అయ్యింది. ఏళ్లుగా బీటి రోడ్డుకు నోచుకోవడం లేదు. రాత్రి వేళ కల్వర్టు దగ్గర ఆదమరచి వెళితే ప్రాణాలు హామ్‌ఫట్ అని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి నూతన కల్వర్టును నిర్మించాలని పలువురు కోరుతున్నారు.



శిథిలమైన కల్వర్టు

సేవా తత్పరత కలిగి ఉండాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

గ్రంధాలయాలకు వెళ్లి చదివి ఉన్నత స్థాయికి ఎదిగిన తర్వాత సేవా తత్పరత కలిగి ఉండాలని మాజీ రాజ్యసభ సభ్యులు టిజి.వెంకటేష్ అన్నారు. గురువారం జిల్లా కేంద్ర గ్రంధాలయంలో 58వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ రాజ్యసభ సభ్యులు టిజి.వెంకటేష్ ,విద్యావేత్త బివి సుబ్బారెడ్డి, విద్యావేత్త డాక్టరు కెవి.సుబ్బారెడ్డి, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ అద్యక్షులు కూరాడి చంద్రశేఖర కల్కూర,కెజీ గంగాధరరెడ్డి , ఎఫ్ఎసి కార్యదర్శి వి.పెద్దక్క, సహాయ గ్రంధాలయాధికారి వి.గోవిందరెడ్డి పాల్గొన్నారు. టిజి.వెంకటేశ్ మాట్లాడుతూ గ్రంధాలయాలు దేవాలయాలని, క్రమశిక్షణతో ఆసక్తితో ప్రతి ఒక్కరూ వెళ్ళి అక్కడి పుస్తకాలలో ఉన్న సాహిత్యాన్ని, చరిత్రను చదివి విద్యావంతులై ఉన్నత దశకు చేరి నవ సమాజ ఉన్నతికి వారు అబివృద్ధి చెంది సేవాతత్పరులుగా ఉండాలని, విద్యార్థులు, ప్రజలు పత్రికలు, పుస్తకాలను చదవడంఅలవాటు చేసుకోవాలన్నారు. కెవి .సుబ్బారెడ్డి, బివి.సుబ్బారెడ్డి మాట్లాడుచూ ప్రతి విద్యార్థి, ప్రతి పౌరుడు ప్రతి పుస్తకాన్ని కలిగి వుండాలని, అప్పుడే ప్రజలు చైతన్యవంతులై జ్ఞానాన్ని పొంద కలుగుతారన్నారు. వివిధ పోటీ పరీక్షలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎఫ్ ఎస్‌సి కార్యదర్శి వి.పెద్దక్క ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. సహాయ గ్రంధాలయాధికారి వజ్రాల గోవిందరెడ్డి, లైబ్రేరియన్ ఎస్.బాష సిబ్బంది ,పాఠకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపి టిజి.వెంకటేష్



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న డాక్టర్ రాయపు రామచంద్రారెడ్డి

డిసెంబర్ 9,10 తేదీల్లో 5వ బాలోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

డిసెంబర్ 9,10, తేదీలలో మాంటిస్సోరి ఇండస్ స్కూలులో నిర్వహించే 5వ బాలోత్సవం పిల్లల పండుగను జయప్రదం చేయాలని డాక్టర్ రాయపు రామచంద్రారెడ్డి, బాలోత్సవ కమిటీ కార్యదర్శి ధనుంజయ కోరారు. కర్నూలు నగరంలోని వెంకటరమణ కాలనీ కేశవరెడ్డి విద్యాసంస్థలో బాలోత్సవ కమిటీ నిర్వహించిన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ రాయపు రామచంద్రారెడ్డి, కార్యదర్శి ధనుంజయ, ప్రిన్సిపల్ బహుమతులను అందజేశారు. పిల్లలు దంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సలహాలు ఇచ్చారు. రోజుకు రెండు సార్లు బ్రెస్సింగ్ చేసుకోవాలని, జంక్‌ఫుడ్ కు దూరంగా ఉండాలని తెలిపారు. విద్యార్థులు బాలలకు జరిగే పోటీలలో పాల్గొనాలన్నారు. ఉపాధ్యాయులను అడిగి సందేహాలు నివృత్తి చేసుకోవాలన్నారు. ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలని అప్పుడే విజ్ఞానవంతులు అవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిసెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-కర్నూలు లీగల్



జిల్లాలోని అన్నికోర్టు ఆవరణలలో డిసెంబర్ 13న జాతీయలోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలావెంకట శేషాద్రి తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి సూచనల తో గురువారం కర్నూలు జిల్లా కోర్టు లోని న్యాయ సేవ సదన్‌లో బి.లీలా వెంకట శేషాద్రి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. డిసెంబర్ 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై ఇన్సూరెన్స్, మున్సిపల్, ఫైనాన్స్‌అండ్‌చిట్ ఫండ్, బ్యాంక్ మేనేజర్స్, ఇన్సూరెన్స్ న్యాయ వాదులు, బిఎస్ఎన్ఎల్ అధికారులు, పంచాయతీ ఆఫీసర్స్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కోర్టులలో పెండింగ్ ఉన్న కేసులు, మోటార్ ఆక్సిడెంట్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులను, బ్యాంక్ డీఫాల్టర్ కేసులను, మున్సిపాలిటీ ప్రాపర్టీ టాక్స్ కేసులు, బిఎస్ఎన్ఎల్ కేసులు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోని వారి కేసులను రాజీ పూర్వకంగా పరిష్కరించు కోవాలని కోరారు. బ్యాంక్ మేనేజర్స్, పంచాయతీ ఆఫీసర్స్, మున్సిపాలిటీ అధికారులు, ఇన్సూరెన్స్ కంపెనీ అధికారులు, బిఎస్ఎన్ఎల్ అకౌంట్స్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రికార్డులను తనిఖీ చేసిన ఎస్పీ

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయం, మాధవరం పోలీసుస్టేషన్‌లోని రికార్డులను ఎస్పీ విక్రాంత్ పాటిల్ తనిఖీ చేశారు. గురువారం వార్షిక తనిఖీలో భాగంగా సర్కిల్ కార్యాలయంతో పాటు మాధవరం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఆయనకు ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి, సిఐ రామాంజులు, సిబ్బంది స్వాగతం పలికారు. రెండు స్టేషన్లలో నమోదైన పెండింగ్‌లో ఉన్న కేసులు, వాటి స్థితిగతులు, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తులు, వాటి పురోగతిని పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల గురించి ఆరా తీశారు. డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. కేసులు నమోదు చేసి, శిక్షలు పడేవిధంగా చూడాలన్నారు. ప్రాపర్టీ కేసులను ఛేదించి రికవరీలు చేయాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్ చేయాలన్నారు. బాధితులు పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించినప్పుడు వారి సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సైబర్ నేరాలపై, మహిళల చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అంతకుముందు మాధవరం పోలీసు స్టేషన్‌లో మొక్కలు నాటారు. సిఐ గుణశేఖర్ బాబు, సిఐ రామాంజులు, ఎస్ఐ విజయ్ కుమార్ పాల్గొన్నారు.


రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

ఆదోని టౌన్ ప్లానింగ్‌లో మాయాజాలం..!

- అడ్డదారుల్లో ఇంటి నిర్మాణాలకు అనుమతి - కలెక్టర్ ఆదేశాలతో గుండెల్లో గుబులు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మున్సిపాలిటీలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో కొందరు సెక్రటరీలు మాయాజాలం చేసినట్లు సమాచారం. ధనార్జనే ధ్యేయంగా అక్రమాలకు తెర లేపారు. ప్లానింగ్ అప్రూవల్ చేసే వ్యవహారంలో అడ్డదారుల్లో ఇంటి నిర్మాణాలకు అనుమతి ఇచ్చి రూ.లక్షలు జేబుల్లో వేసుకున్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని ఓ వ్యక్తి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో అక్రమాలపై విచారణ జరిపించాలని ఆదేశాలు ఇచ్చారు. అక్రమాలకు తెరలేపిన వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

ఆదోనిని ఎలా అభివృద్ధి చేయాలో ప్రణాళిక రూపొందించాలని ఉన్నతాధికారులు చెబుతుంటే.. డబ్బులు ఎలా సంపాదించాలని కొందరు ప్లానింగ్ సెక్రటరీలు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఆదోని వార్డు ప్లానింగ్ సెక్రటరీలు అనధికారికంగా ఎల్‌టిపి లైసెన్స్‌డ్ ఇంజినీర్ల లాగిన్ ఐడిలు ఉపయోగించి వచ్చినకాడికి డబ్బులు దండుకుంటున్నారని విమర్శలున్నాయి. ఏకంగా 780 భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేసినట్లు ఫిర్యాదులు అందాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడంతో ఆదోని మున్సిపాలిటీ ఖజానాకు పెద్ద గండి కొట్టారని పలువురు విమర్శిస్తున్నారు. సామాన్యులు ఇల్లు నిర్మించుకోవాలంటే సవాలక్ష నిబంధనలు పెడుతున్న అధికారులకు ఇంత భారీ మొత్తంలో జరిగిన అక్రమ వ్యవహారం గురించి తెలియకపోవడం అనుమానాలకు తావిస్తోంది. సామాన్యులు కొంత ఆక్రమిస్తే వెంటనే కూల్చివేయడం, లేదా మామూళ్లు దండుకోవడం జరుగుతుందని పలువురు మండిపడుతున్నారు. వార్డు ప్లానింగ్ సెక్రటరీల నిర్వాకం కాస్త కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆదోని మున్సిపాలిటీలో జరిగే అవినీతిపైనా, అడ్డదారుల్లో పొందిన అనుమతుల మంజూరుపైనా సమగ్ర విచారణ చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. కలెక్టర్ ఆదేశాలతో మున్సిపల్ కార్యాలయంలోని ప్లానింగ్ విభాగం సెక్రటరీలకు గుబులు పట్టుకున్నట్లు సమాచారం. ఇల్లు, ఇతర భవనాల నిర్మాణాలు చేపట్టాలంటే మున్సిపల్ లైసెన్స్ సర్వేయర్ లాగిన్ ద్వారా ప్లాన్ అప్రూవల్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రాంతాన్ని బట్టి మార్కెట్ విలువకు సరిపడే ఫీజు చెల్లించాల్సి ఉంది. అడ్డదారుల్లో లాగిన్ పొంది రూ.వేలకు వేలు దోచుకున్నట్లు విమర్శలు ఉన్నాయి. కొందరు వార్డు ప్లానింగ్ సెక్రటరీల నిర్వాకం వల్ల తాము ఉపాధి కోల్పోయామని లైసెన్స్‌డ్ సర్వేయర్లు వాపోతున్నారు. ఇలాంటి అక్రమాలు జరగకుండా కట్టడి చేయాలని కోరుతున్నారు. ఇదే విషయంపై మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ బాల మద్దయ్య వివరణ కోరగా... కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చిన మాట వాస్తవమేనని, సమగ్రంగా విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు. పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని చెప్పారు.


ఆదోని మున్సిపల్ కార్యాలయం

చర్యలు తీసుకోవాలి

- హుస్సేన్ సాని, న్యాయవాది



పట్టణంలో ప్లానింగ్ విభాగంలో అక్రమాలకు తెరలేపిన వార్డు ప్లానింగ్ సెక్రటరీల నిర్వాకంపై సమగ్ర విచారణ చేపట్టాలి. ఆదోని మున్సిపాలిటీలో ఎల్‌టిపి లైసెన్స్‌డ్ ఇంజినీర్ల లాగిన్ ఐడిలు ఉపయోగించి అక్రమార్జన చేస్తున్న వార్డు ప్లానింగ్ సెక్రటరీల భాగోతం బయట పెట్టాలి. ఒక్కో భవన నిర్మాణం కోసం ఉన్నతాధికారులకు రూ.5 వేల వరకు ఇస్తూ అనుమతులు అప్రూవల్ చేసుకుంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి. అనుమతులు ఇచ్చిన వాటిని పునః సమీక్షించాలి. కొందరు అధికారుల బాధ్యతారహితంగా వ్యవహరించడం వల్ల ఇలాంటి అక్రమాలకు తెర లేపారని తెలిసింది.

బాలికలు అన్ని రంగాలు రాణించాలి

- డీఎస్పీ భార్గవి

ప్రజాశక్తి - గోనెగండ్ల

బాలికలు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి తెలిపారు. గోనెగండ్లలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఇంటర్ విద్యార్థులు రాజేశ్వరి, సుమలత జాతీయస్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. డీఎస్పీ భార్గవి గురువారం విద్యాలయాన్ని సందర్శించారు. ఆమె మాట్లాడుతూ... ఇటీవల ప్రపంచ కప్ గెలిచిన భారత మహిళల క్రికెట్ జట్టును స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఇబ్బందులు, సమస్యలుంటే మహిళా పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులను డీఎస్పీ సన్మానించారు. అందుకు కృషి చేసిన పిఇటి కల్యాణి, ప్రిన్సిపల్ విద్యావతిని అభినందించారు.


విద్యార్థినిలను సన్మానిస్తున్న డీఎస్పీ భార్గవి

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

- సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం కన్వీనర్ డి.ఉస్మాన్‌వలీ, కో కన్వీనర్ మహ్మద్ హుస్సేని, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.గోవిందు, బి.రాముడు డిమాండ్ చేశారు. గురువారం ఎమ్మిగనూరు అసిస్టెంట్ లేబర్ అధికారి కార్యాలయం ముందు బిల్డింగ్ కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుకు వ్యతిరేకంగా జిఒ తెచ్చి కార్మికుల నిధిని రూ.1,800 కోట్లను ఖర్చు చేశారని విమర్శించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్ భవన నిర్మాణ కార్మికులకు అనేక హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, 50 ఏళ్లు ఉన్న వారికి నెలకు రూ.10 వేల పింఛను ఇస్తామని హామీఇచ్చారని తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధించాలని కోరారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఎస్.లాలు సాబ్, మధు, బాష, టైగర్ ఖాజా, బి.గోపాల్, బసవరాజు, బి.రంగన్న, వలీ, బి.నాగరాజు, కె.నారాయణ పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న నాయకులు

రాఘవేంద్రుని సన్నిధిలో సీతారామిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్ర స్వామిని వైసిపి రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యులు వై.సీతారామిరెడ్డి గురువారం దర్శించుకున్నారు. స్వామివారి దర్శనార్థమై శ్రీమఠం చేరుకున్న ఆయనకు శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. రిటైర్డ్ తహశీల్దార్ వర్మ, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, వార్డు సభ్యులు రామాంజనేయులు, వైసిపి నాయకులు శివ రాము, గనేకంటి రామయ్య, వ్యక్తిగత సహాయకులు గురురాజ ఉన్నారు.


ఆలయ ప్రాంగణంలో ఉన్న సీతారామిరెడ్డి


పత్తి కొనుగోలు నిబంధనలను సడలించాలి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రభుత్వం సిసిఐ పత్తి కొనుగోలుకు విధించిన పరిమితిని ఎత్తి వేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక రాఘవేంద్ర పత్తి మిల్లులోని సిసిఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలును పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేశులు, రైతుసంఘం నాయకులు కె.మల్లయ్య మాట్లాడారు. పత్తి పంట నాణ్యత లేదని సిసిఐ అధికారులు పత్తిని కొనుగోలు చేయకుండా చాలామంది రైతులను తిరిగి పంపుతున్నారని పేర్కొన్నారు. స్లాట్ బుక్ చేసుకోవడానికి చాలా ఇబ్బందులు పడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కేవలం 2, 3 నిమిషాలు మాత్రమే సమయమిస్తున్నారని, ఈ సమయంలో రైతులందరూ ఒకేసారి స్లాట్ బుక్ చేసుకోవడానికి ప్రయత్నించడంతో బుక్ కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీకి పరిమిత సంఖ్యలో అనుమతి ఇవ్వడమే ప్రధాన కారణమన్నారు. ఎక్కువ క్వింటాళ్లు స్లాట్ బుక్ చేసుకోవడానికి అనుమతి ఇచ్చి రైతుల దగ్గర పత్తినంతా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రాఘవేంద్ర ఫ్యాక్టరీలో ఉన్న కొనుగోలు కేంద్రంలో సిసిఐ అధికారి ఫ్యాక్టరీ యజమానితో కుమ్మక్కయి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. నాణ్యత పేరుతో కొనుగోలు చేయకుండా పత్తిని ఫ్యాక్టరీ యజమానికి పంపిస్తున్నారని రైతులు గోడు వినిపించారని తెలిపారు. ఈ విషయంపై రైతుల తరపున నిలదీయగా 'అదేమీ లేద'ని బుకాయిస్తున్నారని చెప్పారు. నిబంధనల పేరుతో పత్తిని కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులు పెట్టొద్దని, ఎక్కువ కొనుగోలు కేంద్రాలు పెట్టి ఫ్యాక్టరీలకు ఉన్న పరిమితిని సడలించి రైతుల దగ్గరున్న పత్తినంతా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే కొనుగోలు కేంద్రాల వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు వీరేష్, లక్ష్మీ నరసయ్య, వైఎస్ఆర్ కార్మిక సంఘం నాయకులు ప్రాణేష్ కుమార్, రైతు సంఘం నాయకులు రాముడు పాల్గొన్నారు.


యజమానితో మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు


పూజల్లో పాల్గొన్న విజయరాజు

ఉరుకుందలో భక్తుల సందడి

ప్రజాశక్తి - కౌతాళం

రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాల్లో ఒకటైన శ్రీలక్ష్మీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంలో భక్తులతో సందడి నెలకొంది. గురువారం కార్తీక మాసం చివరి రోజు, అమావాస్య కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు తుంగభద్ర దిగువ కాలువలో స్నానాలు ఆచరించి స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఇబ్బందులు కలుగకుండా డిప్యూటీ కమిషనర్ వాణి, పర్యవేక్షకులు వెంకటేష్, మల్లికార్జున తమ సిబ్బందితో చర్యలు చేపట్టారు. తాగునీటి సౌకర్యంతో పాటు నిత్యాన్నదాన సత్రంలో భక్తులకు భోజన సౌకర్యాలు కల్పించారు.

స్వామివారిని దర్శించుకున్న విజయ రాజు : శ్రీలక్ష్మీ నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామిని అనంతపురం జిల్లా గుంతకల్ సమీపంలోని నెట్టేకంటి ఆంజనేయస్వామి దేవాలయం డిప్యూటీ కమిషనర్ విజయరాజు దర్శించుకున్నారు. విజయరాజు గతంలో ఇక్కడ పనిచేసి బదిలీపై వెళ్లారు. ఆయనకు దేవాలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. శాలువా, పూలమాలలతో సన్మానించారు.

మోడీ, బాబు, కల్యాణ్‌కు క్షీరాభిషేకం

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని రైతులకు 'అన్నదాత సుఖీభవ', పిఎం కిసాన్ కింద నగదు జమ కావడంతో గురువారం గోనెగండ్లలోని టిడిపి కార్యాలయం వద్ద కూటమి నాయకులు, రైతులు ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కూటమి నాయకులు మాట్లాడుతూ... మండలంలోని 11,934 మంది రైతులకు రూ.8.25 కోట్లు బ్యాంకు ఖాతాలో జమ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న శ్యాం కుమార్

ప్రజాశక్తి -దేవనకొండ

మండలంలోని నేలతలమర్రి గ్రామానికి చెందిన ఈడిగ ప్రతాప్‌కు సిఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.1,75,204 చెక్కును పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యామ్‌కుమార్ గురువారం అందజేశారు. ఎమ్మెల్యే శ్యామ్‌కుమార్, టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్‌కు ప్రతాప్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి మండల కన్వీనర్ విజయ్ భాస్కర్ గౌడ్, టిడిపి నాయకులు రాజశేఖర్ గౌడ్, రాజు, గోపాల్ గౌడ్ పాల్గొన్నారు.

మంత్రాలయం ప్రశాంతతకు భంగం కలిగించొద్దు

- టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయం ప్రశాంతతకు భంగం కలిగించొద్దని టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి సూచించారు. గురువారం అమావాస్య తిథి సందర్భంగా స్వామి వారిని దర్శించుకునేందుకు ఆయన శ్రీమఠం చేరుకున్నారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకుని మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం పీఠాధిపతులు శ్రీసుబుధేంద్రతీర్థులు ఆయనకు శేషవస్త్రం, ఫల మంత్రాక్షతలు అందజేశారు. ఈనాడు దినపత్రిక విలేకరి శ్రీధర్ స్వామిపై దురుసుగా ప్రవర్తించిన టిడిపి నాయకులపై చర్యలు తీసుకోవాలని, దాడికి యత్నించే సమయంలో రికార్డు అయిన వీడియోను తిక్కారెడ్డికి చూపించి ఫిర్యాదు చేశారు. అనంతరం టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఈనాడు విలేకరి తన విధుల్లో భాగంగా తుంగభద్ర నది నుంచి అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్న వారిని కవరేజ్ చేసేందుకు వెళ్లారని, అక్రమార్కులు అతనిపై దాడికి ప్రయత్నించడం రౌడీయిజం అవుతుందని తెలిపారు. ఇలాంటివి పనికి రావని హెచ్చరించారు. విలేకరుల విధులకు భంగం కలిగించడం నేరమని, ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. టిడిపి బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్‌నాథరెడ్డి, నాయకులు కృష్ణ మోహన్ రెడ్డి, బీసీ సెల్ జనరల్ సెక్రటరీ వట్టెప్ప గారి నరసింహ, వట్టెప్ప గారి చిన్న సుంకప్ప, చిన్న భీమ, హండే అనుమంతు, వనికె నాగరాజు, గనేకంటి రామకృష్ణ, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి ఏబు, కోసిగి నాడిగేని తాయన్న, నాడిగేని మహదేవ, మహేష్, వగరూరు అబ్దుల్, చెట్నిహల్లి తిక్కస్వామి గౌడ్ ఉన్నారు.


మాట్లాడుతున్న తిక్కారెడ్డి

గ్రంథాలయాలు విజ్ఞానం భాండాగారాలు

- ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - చిప్పగిరి

గ్రంథాలయాలు అంటేనే విజ్ఞాన భాండాగారాలని ఎంపిడిఒ అల్లా బకాష్, తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్, ఎంఇఒలు సావిత్రమ్మ, ఫరూక్ తెలిపారు. గురువారం చిప్పగిరి గ్రంథాలయ కార్యాలయంలో గ్రంథాలయ అధికారి అబ్దుల్ రసూల్ ఆధ్వర్యంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. చివరి రోజున పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అధికారుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ వరదరాజులు, హౌసింగ్ అధికారి కృష్ణ కుమార్, పాల్గొన్నారు. **ఆదోని** గ్రంథాలయంలో అధికారి ఆశాజ్యోతి ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని గ్రంథాలయ అధికారి ఆశాజ్యోతి తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఎంఇఒ భూపాల్ రెడ్డి, మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున, నెహ్రూ మెమోరియల్ హైస్కూల్ ఫయాజ్, శ్రీచైతన్య హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు హరి కృష్ణ, నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్ ఉపాధ్యాయులు రమేష్ నాయుడు, సురేష్, కీరా, అమరావతి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మోహన్ కుమార్, నరసింహులు పాల్గొన్నారు. **నందవరం** గ్రామంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయి. గ్రంథాలయం విశిష్టత, ఆవశ్యకత, పఠనం గురించి వివరించారు. వివిధ ఆటల పోటీలు, వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ప్రతిభ కనబరిచిన 40మంది విద్యార్థులకు బహుమతులను ఇచ్చినట్లు గ్రంథాలయ అధికారి వై.శివరామ ప్రసాద్ తెలిపారు. ఎంఇఒ డి.గోవిందు, ఎన్.ఉరుకుందు, పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు శ్రీనివాసులు, గోవర్ధనమ్మ పాల్గొన్నారు. **కౌతాళం**లో 58వ గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయని గ్రంథాలయ అధికారి మధు లీనా తెలిపారు. ఆమె మాట్లాడుతూ... పుస్తక పఠనం, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు, ఇందిరాగాంధీ జయంతి ఇతర కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు అందజేసినట్లు చెప్పారు. కన్నడ పాఠశాల ఉపాధ్యాయులు త్రివేణి పాల్గొన్నారు. **ఆస్పరి**లో గ్రంథాలయ అధికారి విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయి. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. బిజెపి ఆలూరు ఇన్‌ఛార్జీ వెంకట్ రాముడు, కెడిసిసి జిల్లా బ్యాంకు మాజీ డైరెక్టర్ రాఘవేంద్ర, ఆలూరు మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ సంజన్న, జనసేన మండల కన్వీనర్ అరవింద్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్యోతి మూర్తి, ఉపాధ్యాయుల గోరంట్లయ్య, టిడిపి నాయకులు సతీష్ కుమార్ పాల్గొన్నారు. **దేవనకొండ**లో గ్రంథాలయ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. సర్పంచి రంగ లక్ష్మి భర్త బండ్లయ్య, పంచాయతీ కార్యదర్శి మహ్మద్ రఫీ, జ్ఞాన సుధా, భారతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.సుధాకర్, నాజీర్ బాష, ఎఫ్ఆర్ హై స్కూల్ ఉపాధ్యాయులు ఎస్ఎమ్‌డి.బాష, కెజిబివి ఉపాధ్యాయులు మహేశ్వరి పాల్గొన్నారు.


చిప్పగిరిలో బహుమతులు అందజేస్తున్న అధికారులు


ఆస్పరిలో బహుమతులు అందజేస్తున్న అధికారులు, నాయకులు

నందవరం




కౌతాళంలో బహుమతులు అందజేస్తున్న సిబ్బంది

జిల్లా సాధనకు ఉద్యమం

- టిడిపి సీనియర్ నాయకులు భాస్కర్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని జిల్లా సాధనకు ఉద్యమించాలని టిడిపి సీనియర్ నాయకులు సూరం భాస్కర్ రెడ్డి తెలిపారు. ఆదోని జిల్లా ఏర్పాటు చేయాలని, పెద్దహరివాణం గ్రామాన్ని మండలంగా చేయాలని కోరుతూ చేపట్టిన దీక్ష గురువారం ఐదోరోజుకు చేరింది. దీక్ష శిబిరానికి టిడిపి మైనార్టీ నాయకులు సౌదీ రావుఫ్, మాజీ కౌన్సిలర్లు రామచంద్ర, మల్లికార్జున, నాయకులు బుద్ధారెడ్డి, సోమశేఖర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సూరం భాస్కర్ రెడ్డి మాట్లాడారు. ఆదోని సమగ్రాభివృద్ధి చెందాలంటే జిల్లా ఏర్పాటు చేయాలని కోరారు. అవసరమైతే తాను కూడా దీక్ష చేపట్టి శిబిరానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. నాయకులు షేక్షావలీ, సీన, మల్లేష్, శ్రీనివాసులు, గోవిందు, రామకృష్ణ ఉన్నారు. మద్దతు తెలిపిన వారికి శిబిరం నిర్వాహకులు ఆదినారాయణ రెడ్డి స్వాగతం పలికారు. డిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఉదయ్, విద్యార్థులు సంఘీభావం తెలిపారు.


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న సూరం భాస్కర్ రెడ్డి

విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు

- అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకట్రాముడు

ప్రజాశక్తి - ఆదోని

హాస్టల్‌లో వసతి పొందుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అన్ని సదుపాయాలూ కల్పిస్తున్నామని అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకట్రాముడు, సాంఘిక సంక్షేమ హాస్టల్ వార్డెన్ నాగమద్దయ్య తెలిపారు. గురువారం ఎస్సీ-1 బాలుర కళాశాల హాస్టల్‌లో విద్యార్థులకు దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారమే ఆహార పదార్థాలు వడ్డిస్తున్నామన్నారు. గత పదేళ్లుగా విద్యార్థులకు దుప్పట్లు ఇవ్వలేదని, ప్రస్తుతం ఇచ్చిన దుప్పట్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వంట మనిషిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా షోకాజు నోటీసు ఇచ్చారన్నారు. నాణ్యమైన, రుచికరమైన భోజనం అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కళాశాల ఎస్సీ బాలుర హాస్టల్‌లో విద్యార్థులకు తాగునీటి సమస్య ఉందని, శాశ్వత పరిష్కారానికి పైపులైను నిర్మించాలని మున్సిపల్ చైర్మన్, కమిషనర్లకు వినతిపత్రం ఇచ్చామని చెప్పారు. సమస్యను పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చారన్నారు.


విద్యార్థులకు దుప్పట్లు అందజేస్తున్న వార్డెన్

రాష్ట్రస్థాయి పోటీలకు నందవరం విద్యార్థి

ప్రజాశక్తి - నందవరం

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు నందవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి బి.మహేష్ ఎంపికయ్యారు. పులివెందులో జరిగే సాఫ్ట్ బాల్ పోటీలకు బి.మహేష్ ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమని ప్రధానోపాధ్యాయులు రామకృష్ణరాజు గురువారం తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఉమాపతి, అబ్దుల్ లతీఫ్, సూరజ్, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనపరిచి పాఠశాలకు, గ్రామానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



సిఐ కారును తీసుకెళ్లిన యువకుడు

- ఆలూరులో పోలీసులు హైరానా..!

ప్రజాశక్తి-ఆలూరు

పట్టుకున్న మోటార్ బైక్ ఇవ్వలేదన్న కోపంతో యువరాజ్ అనే యువకుడు ఆలూరు సిఐ కారును తీసుకెళ్లడంతో పోలీసులు గురువారం హైరానా పడ్డారు. ఆలూరులో బుధవారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన యువరాజ్ (ఎపి 39 హెచ్‌ఎఫ్ 8517 గల పల్సర్) బైక్‌ను స్టేషన్‌లో పెట్టారు. 'జరిమానా కడుతాను. నా బైక్ ఇవ్వండి' అనిఆ యువకుడు పోలీసులను వేడుకున్నారు. పోలీసులు ఇవ్వకపోవడంతో కోపంతో పోలీసు బైక్‌నే తీసుకుని తన గ్రామమైన పెద్దహోతూరు వెళ్లిపోయారు. విషయాన్ని గమనించిన అతని తమ్ముడు అంజి వెంటనే పోలీసు బైక్ తీసుకొచ్చి స్టేషన్‌లో అప్పగించారు. బైక్ తీసుకెళ్లిన విషయం స్టేషన్‌కు పోలీసు బైక్ వచ్చే వరకు పోలీసులకు తెలియదు. పట్టుబడిన బైక్ కావాలంటే వాడిని ఉదయం స్టేషన్‌కు రావాలని తమ్ముడికి చెప్పడంతో గురువారం యువకుడు పోలీసు స్టేషన్‌లో హాజరయ్యారు. ఆ యువకునితో స్టేషన్‌లో పని చేయించుకొని సాయంత్రం 4 గంటలైనా బైక్ ఇవ్వకపోవడంతో ఆ యువకుడు నిరీక్షించి ఆగ్రహంతో స్టేషన్‌లో ఉన్న సిఐ కారును తీసుకొని తన గ్రామానికి వెళ్లిపోయారు. సిఐ కారు స్టేషన్‌లో లేకపోవడంతో హైరానా పడిన పోలీసులు సిసి కెమెరాలను పరిశీలించిన తర్వాత యువకుడే తీసుకెళ్లినట్టు తెలిసింది. రాత్రి బైక్ అప్పజెప్పిన ఆ యువకుడి తమ్ముడు మళ్లీ ఆ కారు తీసుకొస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. 'సార్ మా అన్న తీసుకొచ్చాడు. మీకే అప్పగించడానికి తీసుకొస్తున్నా' అని స్పష్టంగా చెప్పినా, అతన్ని స్టేషన్‌లోనే కూర్చోబెట్టడం వల్ల కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. విషయం తెలిసిన గ్రామస్తులు, స్థానికులు అవాక్కయ్యారు.



గడ్డి మందుతో పంటను నాశనం చేసిన దాయాదులు

- రూ.10 లక్షల పంట నష్టం - మాబుసాబ్, దస్తగిరమ్మ

ప్రజాశక్తి - మంత్రాలయం

మిరప పంటకు గడ్డి మందు కొట్టి దాయాదులు నాశనం చేశారని మండలంలోని సూగూరు గ్రామానికి చెందిన బాధితులు పింజరి మాబుసాబ్, దస్తగిరమ్మ వాపోయారు. గురువారం వారు మాట్లాడారు. రూ.2 లక్షలు అప్పు చేసి తమకున్న రెండున్నర ఎకరాల భూమిలో ఎకరా సింగం బ్యాడిగ మిరప పంట సాగు చేసినట్లు తెలిపారు. మిరప పంట బాగా పడడంతో ఆనందంగా ఉన్నామని, చేతికొచ్చిన పంట అమ్మితే అప్పులు తీరుతాయని ఆశగా ఉన్నట్లు చెప్పారు. పంటను చూసి చుట్టుపక్కల ఉన్న దాయాదులు కడుపుమంటతో రాత్రి గడ్డి మందు కొట్టి నాశనం చేశారని వాపోయారు. రూ.10 లక్షల నష్టం వాటిల్లిందని తెలిపారు. అప్పులు ఎలా తీర్చాలని ఆవేదన వ్యక్తం చేశారు. పంటను నాశనం చేసిన వారిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ఆదుకుని నష్ట పరిహారం చెల్లించాలని కోరారు.


మాట్లాడుతున్న బాధితులు మాబుసాబ్, దస్తగిరమ్మ